క్లుప్తంగా

మల్కాపురంలో సోషల్ ఆడిట్ గ్రామసభ



మల్కాపురం(జగ్గయ్యపేట):గ్రామంలోని సచివాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో 2020–22కు సంబంధించిన పనుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, సామాజిక పింఛన్‌లు, ఎస్ఎస్ఏ పనులు శాఖలకు సంబంధించిన వివరాలపై మాట్లాడారు. ఏపీఎం సంతోష్, సర్పంచ్ విద్యాసాగర్, జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ లక్ష్మీ హారిక, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవానికి సంబంధించి కల్యాణ పీటలపై కూర్చోవడంతో పాటుసారె సమర్పించుటకు ఆసక్తి గల దంపతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5న జరుగు అమ్మవారి కల్యాణానికి సంబంధించి పీటలపై కూర్చొను దంపతులు దరఖాస్తుతో పాటు రూ.5,116 కార్యనిర్వాహణాధికారి, తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు వారి పేరు మీద, ఏదైనా జాతీయ బ్యాంక్ నందు డీడీ తీసి దరఖాస్తుతో జత పరచి జనవరి 27, సాయంత్రం 4 గంటలలోపు పంపాలని కోరారు.

కేపీ రెడ్డయ్యకు నివాళి



చిల్లకల్లు(జగ్గయ్యపేట):మాజీ ఎంపీ కొలుసు పెద్ద రెడ్డయ్య సేవలు ఎనలేనివని పలువురు నాయకులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన సెంటరులో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో రెడ్డయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయవేత్తగా రెడ్డయ్య అందించిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు చల్లా వైకుంఠరావు, పచ్చిపాల నాగేశ్వరరావు, మీసాల రాజు, ఆనంగి శ్రీనివాస్, శ్రీరాం నాయక్, పేరయ్య, తుమాటి కృష్ణ, మురళి, వెంకట నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నందిగామ:పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందజేసేందుకు అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 200 మంది తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులకు కూడా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఏఎస్ఓ అశోక్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఊర చెరువు సుందరంగా తీర్చిదిద్దుతాం



జగ్గయ్యపేట:పట్టణంలోని కేంద్ర బిందువుగా ఉన్న ఊర చెరువును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. చెరువు వద్ద అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ చెరువు చుట్టూ అధునాతన వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామని చెప్పారు. అంతే కాకుండా చిన్నారులకు ఆహ్లాదకరంగా ఉండేలా మినీ పార్కుతో పాటు పలు వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చొరవతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, వేముల విజయ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్ల 16వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పాద యాత్రతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారని చెప్పారు. దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ... సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే నన్నారు. సర్పంచ్ వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ మాడుగుల శంకర్, నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, శేషం వాసుబాబు, గుదే రంగారావు, సృజనీకుమార్, మేకల బాబు, వేల్పుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, శివ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్, ఇల్ల సుబ్బారావు, వీఆర్వో మీసాల రమేష్ దాసరి రాజా, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం



మాట్లాడుతున్న సీడీపీవో గ్లోరీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట):సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరీ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిలుపుదల చేసేందుకు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దిశ యాప్‌ను మహిళల కోసం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ యాప్‌ను కూడా ప్రతి మహిళ, విద్యార్థినులు తమ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్‌లు రజనీ జ్వాలా, దుర్గాదేవి, జోజి కటాక్షం, కుమారి, లక్ష్మీ కాంతమ్మ, సుజాత, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగనవాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వత్సవాయి: చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రజాప్రతినిధులతో కలిసి అంగన్‌వాడీలు పర్యవేక్షించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందింతే వెంటనే ఆయా పరిధిలోకి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారాన్ని అందించి నిలుపుదల చేసే విధంగా చూడాలన్నారు. లైంగిక వేధింపులకు గురయ్యే మహిళలు ధైర్యంగా సమస్యను అధికారులకు తెలియజేయాలని చెప్పారు. సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు:బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం భేటీ బచావో..భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాలపై ఆలయ పూజారులు, చర్చి పాస్టర్‌లు, ముస్లిం మత పెద్దలలతో అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాలిక విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు.

చదువు ఎంతో ఉపయోగం...

ఆడపిల్లకు చదువు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆడపిల్లను చులకనగా చూడటం మానేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్య రేణుక, వైద్యాధికారి కె. వాణి తదితరులు మాట్లాడుతూ చిన్నతనంలోనే వివాహాలు చేయటం వలన పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని వెల్లడించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించటంతో పాటు ఏమైనా సమస్యలుంటే బాలికలు తల్లి, ఉపాధ్యాయినులు, ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, న్యాయవాది వేల్పుల స్వర్ణపద్మతేజ, మహిళా సంరక్షణా కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ దేశభక్తి అందరికీ ఆదర్శనీయం



నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, నాయకులు



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్

నందిగామ:రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, స్వరాజ్య సాధనలో కీలక పాత్ర పోషించిన వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పలువురు వక్తలు కొనియాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా నేతాజీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు చోట్ల గల ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పలు చోట్ల ఆయన చిత్రపటాలు ఏర్పాటుచేసి వాటికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంగ్లేయును తరిమి కొట్టడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరిలో జాతీయ కాంక్షను రగిలించి, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి బ్రిటీష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు నేతాజీ అని శ్లాఘించారు. నేతాజీలోని దేశ భక్తి మనందరికీ ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. నేతాజీ నగర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, మహమ్మద్ రసూల్, షేక్ దాదా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేతాజీ త్యాగం మరువలేనిది

జగ్గయ్యపేట:స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నేతాజీ విగ్రహానికి ప్లాంట్ ఇన్‌చార్జ్ రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ త్యాగం మరువలేనిదని చెప్పారు. ఆయన సేవలను ఎప్పటికీ భారతావని గుర్తుంచుకుంటుందని తెలిపారు. ప్లాంట్ సిబ్బంది సర్వేశ్వరరావు, కిరణ్‌కుమార్ సింగ్, శ్రావణ్ కుమార్, విద్యార్థులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

23జెపిటి61:బోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యాధికారి, తదితరులు

నేతాజీ సేవలు ఎనలేనివి

కొణకంచి(పెనుగంచిప్రోలు):దేశానికి నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె. వాణి తెలిపారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో బోస్ యువతకు ఒక మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ గోనెల దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 13 అర్జీలు స్వీకరణ



స్పందన లో అర్జీలు అందుకుంటున్న ఆర్డీవో

కంచికచర్ల: స్పందనలో ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ఇళ్ల స్థలం కావాలని మూడు, రేషన్‌కార్డు కోసం ఒకటి, పట్టాదార్ పాసుపుస్తకం మరొక దరఖాస్తు వచ్చాయని పేర్కొన్నారు. అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ కె.శిల్ప, ఎంఈఓ ఎల్ చిట్టిబాబు, హౌసింగ్ ఏఈ ఏ నరసింహారావు, పీఆర్ ఏఈ టీవీ రవికుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 8 అర్జీలు

నందిగామ:సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు మండలాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దీర్ఘకాల సమస్యలు సైతం స్పందన ద్వారా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

చదువుతోనే ప్రగతి సాధ్యం

జమ్మవరం(వీరులపాడు):బాలికల చదువుతోనే ప్రగతి సాధ్యమని సీడీపీవో లక్ష్మీ భార్గవి తెలిపారు. మండలంలోని జమ్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటివి అభివృద్ధి నిరోధకాలుగా మారాయని వాటిని అరికట్టేందుకు సహకరించాలని కోరారు. అనంతరం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచులు శీలం సంధ్య, మల్లెల అనూష రాణి, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, సూపర్‌వైజర్ ప్రభావతి, అంగనవాడీ కార్యకర్తలు సుజాత, మహాలక్ష్మీ, రాణి తదితరులున్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి అభినందనలు



రూపేష్‌బాబును శాలువాతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సుధీర్, డీన్ ప్రకాష్ తదితరులు

కంచికచర్ల :తమ కళాశాలలో నాణ్యమైన విద్యనందించటంతో పాటు క్రీడా రంగంలో మంచి తర్ఫీదు ఇస్తున్నామని బీజేటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బ్రదర్ సుధీర్ తెలిపారు. మండలంలోని కీసర బీజేటీ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న రూపేష్ బాబు ఏపీ స్టేట్ లెవెల్ అండర్ 17 షాట్ పుట్‌లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించినందుకు కళాశాలలో సోమవారం అభినందించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళంలో ఆన్స్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో రూపేష్‌బాబు షాట్‌పుట్ క్రీడలో పాల్గొని ప్రతిభ కనపర్చారన్నారు. తమ కళాశాలలో మెరుగైన విద్యనందించటంతో పాటు పరిశ్రమలు స్థాపన చేసేందుకు అవసరమైన మెలకువలు నేర్పిస్తున్నామన్నారు. అనంతరం గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని అభినందించారు. ఇంటర్మీడియట్ రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి రవికుమార్, బ్రదర్ దుగ్గిరాల ప్రకాష్, బ్రదర్ రీగన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య డ్రైవ్‌కు ప్రజలు సహకరించాలి

నందిగామ: పారిశుద్ధ్యం మెరుగుదలకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని తొమ్మిదవ వార్డు పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. కేవలం చెత్తను సేకరించే వాహనం వచ్చినప్పుడు మాత్రమే వాటిని అందజేయాలని, వీధుల వెంట ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడవేయవద్దని సూచించారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద పుట్టు వెంట్రుకల కార్యక్రమం

వీరులపాడు:మహనీయుల ఆశయాల బాటలో నడవాలని చెప్పటమే కాదు ఆచరించాలని చాటి చెప్పేలా కొత్త సంస్కృతికి వీరులపాడు గ్రామం నెలవైంది. వివరాలలోకి వెళితే పుట్టువెంట్రుల కార్యక్రమం ఎవరైనా వారివారి మతాలను బట్టి ఆలయాలు, చర్చిలు, మసీదులలో నిర్వహించుకుంటుంటారు. కానీ బీఎస్పీ మండల అధ్యక్షుడు గుడిశ రామకృష్ణ మాత్రం తన కుమార్తె సురేఖ పుట్టు వెంట్రుల కార్యక్రమాన్ని వీరులపాడు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించి మహనీయుల ఆశయ సాధనలో భాగమవుతానని చాటి చెప్పాడు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

నందిగామ టౌన్:రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా పోలీస్, రవాణా శాఖాధికారులు సంయుక్తంగా సోమవారం భద్రతా నియమాలపై అవగాహన కలిగించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మద్యం తాగి, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడటంతో పాటు కారులు, తదితర వాహనాల చోదకులు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. ఏసీపీ నాగేశ్వరరెడ్డి, ఆర్టీవో పద్మావతి, ఎంవీఐ రాజు, సీఐలు సతీష్, రాజు, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు చిరుమామిళ్ల చైతన్య కుమార్, నల్లమల్లి మురళి, వినుకొండ రామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట):వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయవద్దని గరికపాడు చెక్ పోస్టు ఎంవీఐ శివరామగౌడ్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా గ్రామంలోని టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు హెల్మెట్, సీట్‌బెల్ట్‌పై సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ రామారావు, టోల్ ప్లాజా సిబ్బంది ఆలం, నాగకృష్ణ, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వరరావు, శరత్‌చంద్ర, సువర్ణరావు, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించడం సాధ్యమవుతుందని ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వాహనదారులు, స్కూల్, కళాశాలల డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన కల్పించారు ముందుగా ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మేరకు ఏసీపీ మాట్లాడుతూ రహదారిపై భద్రత జీవితానికి రక్షణ అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, అదేవిధంగా కార్లు నడిపే వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని కోరారు. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు, టోల్‌ప్లాజా సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

ఘనంగా వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



అమ్మవారి సామూహిక కుంకుమార్చనలో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

నందిగామ:వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 8 గంటలకు పలు రకాల పండ్లు, పాలతో అమ్మవారికి అభిషేకం గావించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. సాయంత్రం 5 గంటలకు బోనాల సమర్పణ కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల పొంగళ్లు తయారుచేసి వాటిని శిరస్సుపై ఉంచుకొని అమ్మవారిని స్తుతిస్తూ, డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. రాత్రి సమయంలో భక్తులు నిప్పుల గుండంలో నడిచే కార్యక్రమం కోలాహలంగా సాగింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్త జన సందోహం సమక్షంలో కొందరు భక్తులు నిప్పుల గుండంలో నడచి అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో....

వత్సవాయి :వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దంపతులు, మహిళలు కుంకుమపూజలు చేశారు. ముందుగా గోపూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు, కొత్తా నరసింహారావు, దుగ్గి ఉమామహేశ్వరరావు, గుర్రం మోహన్ రావు, పోలా పూర్ణయ్య, గుర్రం శ్రీధర్, యర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జలకళతో సాగునీటి సమస్య పరిష్కారం

అల్లూరు(వీరులపాడు):జలకళ పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న బోరు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. రైతుల సాగు నీటి కష్టాలను తొలగించటంతో పాటు బీడు భూములను సైతం సస్యశ్యామలం చేసేందుకే జలకళ పథకాన్ని ప్రవేశపెట్టి సన్నచిన్నకారు రైతుల భూముల్లో ఉచితంగా బోర్లు వేయిస్తున్నారని తెలిపారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోటేరు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, నాయకులు బెల్లంకొండ నాగేశ్వరరావు, మావూరి రాజగోపాల్‌రెడ్డి, ఏపీవో జనార్దన్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌ల పంపిణీ



కార్మికులకు జాకెట్‌లు అందజేస్తున్న చైర్మన్

జగ్గయ్యపేట:మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వార్డుల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రేడియం జాకెట్‌లు కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసే విషయంలో కార్మికులకు సహకరించాలని కోరారు.

ప్రజారోగ్యం విభాగం అధికారులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఇన్‌చార్జ్ కమిషనర్ శివకోటేశ్వరరావు, కౌన్సిలర్‌లు మనోహర్, రోశయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవి, నాగేంద్ర, ఫిరోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.